శుభాళి - ఆది

ఇందిరారమణు దెచ్చి - యియ్యరో మాకిటువలె
పొంది యీతని బూజింప - బొద్దాయనిపుడు

దారుణి మైరావణు - దండించి రాముదెచ్చి
నేరుపున మించిన అంజ - నీతనయా
ఘోరనాగ పాశముల - గొట్టివేసి యీతని
కారుణ్య మందినట్టి - ఖగరాజ గరుడా

నానాదేవతలకు - నరసింహుగంభములో
పానిపట్టి చూపినట్టి - ప్రహ్లాదుడా
మానవుడై కృష్ణ - మహిమల విశ్వరూపు
పూనిబండి నుంచుకొన్న - పోటుబంట యర్జునా;

శ్రీవల్లభునకు న - శేష కైంకర్యముల
శ్రీవేంకటాద్రి వైన - శేషమూరితీ
కైవసమున యట్టి - కార్త వీర్యార్జునుడా యీ
దేవుని నీవేళయిట్టె - తెచ్చి మాకునియ్యరే

అన్నమాచార్యుల దేవతార్చనా విగ్రహాలు, విద్యానగరాన్ని విజయనగర గజపతులు ఆక్రమించినప్పుడో, యెప్పుడో ముష్కరులచే దొంగిలించబడ్డవి. అన్నమాచార్యుల ఆక్రోశం ఈ సంకీర్తనగా స్వరూపసిద్ధి చెందినది. పేరు పేరునా హరిభక్తులను పిలిచి తన దేవతార్చనా విగ్రహాలు వెతికితెచ్చే బాధ్యత అనుశాసనికంగా అభ్యుద్గతం చేసిన సంకీర్తన మిది.

మా శ్రీవల్లభుని తెచ్చి ఇవ్వండి. ఆయనకు పూజలు చేసేవేళ అయినది -

పాతాళవాసియైన మైరావణుని సంహరించి శ్రీరాముణ్ణి వెతికితెచ్చిన హనుమంతా; ఇంద్రజిత్తు మాయలతో పన్నిన నాగపాశబంధాలచే అవశులై ఉన్న రామలక్ష్మణులకై ఆ నాగబంధాలను చీల్చి చెండాడిన గరుత్మంతా; దేవతలందరికీ నరసింహుని స్తంభంలో ఆవిర్భవింపజేసి చూపి ప్రతిజ్ఞాపాలనమొనర్చినప్రహ్లాదుడా; (ఎందెందు వెదకి చూచిన నందందేకలడు చక్రి అన్నదే ప్రహ్లాదుని ప్రజ్ఞా ప్రతిజ్ఞ) మానవాకృతియైన శ్రీకృష్ణుని, విశ్వ రూపుని రధసారథిగా రావించుకొన్న మేటీ! కిరీటీ ! మా శ్రీ స్వామిని వెతికితెచ్చి మా కివ్వండి.

శ్రీవల్లభునికి అశేష సేవావిశేష రచన చేసిన శేషఫణీంద్రా; నీవే స్వామికై శ్రీవేంక టాద్రివైనావు. సహస్రకరాల కార్తవీర్యార్జునా; మీరందరూ ఈదేవుని వెతికి తెచ్చి యివ్వండి మాకు అని అభ్యర్థనా శాసనమొనర్చారు అన్నమాచార్యులు. ఆయనకు ఆ విగ్రహాలు దొరికే ఉంటాయి.